క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు



శ్రీలక్ష్మి, పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

మునగపాక : పాటిపల్లి మోడల్ స్కూల్లో ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.పి.ఎస్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 సంవత్సరానికి ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ విద్యార్థులు రూ.200 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూన్ 7వ తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తును మోడల్ స్కూల్లో అందించాలన్నారు.

విజ్ఞాన శిబిరాలతో మంచి నడవడిక



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కోటవురట్ల : వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచుతున్నాయని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు, పద్యాలు చెప్పడంపై సాధన చేయించారు. సెలవుల్లో విద్యార్థులు పక్కదారి పట్టకుండా చదువుపై ఆసక్తిని పెంచేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. రీసోర్స్ పర్సన్స్‌గా ఉపాధ్యాయుడు మస్తాన్, దామంతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు

మునగపాక : వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. సోమవారం మూలపేటలో ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి పనులు చేసే కూలీలు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా మంచి నీటిని తాగాలన్నారు. మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద, వార్డు సభ్యులు యల్లపు హైమావతి, నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు, రైతు సంఘ అధ్యక్షుడు శరగడం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ బుజ్జిబాబు

మునగపాక : ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు అన్నారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కోటవురట్ల : మండలంలో ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ శిబిరాలలో కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్‌లో తప్పులు సరిచేయడం వంటి పనులు నిర్వహిస్తారని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.. 23 నుంచి 25 వరకు యండపల్లి, రామచంద్రపాలెం, 30న తంగేడు, చినబొడ్డేపల్లి, 31న తంగేడు గ్రామంలో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

రాంబిల్లి: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి. దేముడునాయుడు డిమాండ్ చేశారు. పంచదార్లలో సోమవారం ఉపాధికూలీలతో కలిసి నిరసన తెలిపారు. ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు రూ.600 చెల్లించాలని కోరారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



నక్కపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



మడుతూరులో వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం



సత్కారం పొందుతున్న వలంటీర్లు

ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : ప్రభుత్వం నియమించిన గ్రామ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కరోనా సంక్షోభ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడగలిగామని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం నక్కపల్లి పీఏసీఎస్ పరిధిలో ఉన్న గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు తమకు కేటాయించిన ప్రతి 50 కుటుంబాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీరు తీసుకెళ్లి పింఛను అందిస్తుంటే అవ్వాతాతల కళ్లల్లో ఆనందం కలుగుతోందన్నారు. వలంటీర్లు ఎంతో బాధ్యతతో నిబద్ధతతో పనిచేయడం వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్నారు. వీరి సేవలు వెలకట్టలేని వన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించాలనే ఉద్దేశ్యంతో సన్మానించి వారికి కొంత నగదు సాయం చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భావించారన్నారు. ఈ కార్యక్రమం వారిని మరింత ప్రోత్సహించడం కోసమేనన్నారు. వలంటీర్లు మూటలు గోనె సంచులు మోయడానికేనని చంద్రబాబు వ్యాఖ్యానించడం వారిని తీవ్రంగా అవమానించడమేనని అన్నారు. వలంటీర్లకు చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఇప్పుడు అయన వలంటీర్ల వ్యవస్థ కొనసాగస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యులు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, పార్టీ బీసీ సెల్ నాయకులు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నీరజ, ఈవోపీఆర్డీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మేలు

మునగపాక : వలంటీర్ వ్యవస్థ అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధిగా నిలుస్తున్నారన్నారు. మండలంలోని అరబుపాలెం, ఒంపోలు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు ప్రజా ప్రతినిధులు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా వలంటీర్లు సేవలందిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారం జానకీరామ్, పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాల అందజేత

అచ్యుతాపురం(అనకాపల్లి): వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని, గౌరవ వేతనంతో ప్రజల సమస్యలన్నిటినీ పరిష్కరించేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని మడుతూరులో వలంటీర్లను సత్కరించారు. సేవా రత్న కింద ఎంపికైన వలంటీర్ బద్ది దేవికి రూ.ఇరవై వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో వలంటీర్ల సేవ నూతన ఒరవడిని సృష్టించిందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల్ని వలంటీర్లే గుర్తించి, వారి చేత దరఖాస్తు చేయించడం అవసరమైన ధృవీకరణ పత్రాలు అందజేయడం ద్వారా వలంటీర్లు ఒక సేవామిత్రునిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మిగిలిన 13 మంది వలంటీర్లకు సేవా మిత్ర ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ సంజీవి, జువ్వలనాయుడు, ఎంపీపీ బుజ్జి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వడిశెల శ్రీనివాసరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, పార్టీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా సీఎం పాలన



ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అందుకే ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలో గల మాసాహేబుపేట గ్రామంలో ఆయన గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రజలకు వివరిస్తూ గ్రామంలో లబ్ధిదారులను, పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకుంటున్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, రైతుభరోసా, కాపు నేస్తం, సున్నా వడ్డీ, ఆసరా, చేయూత తదితర పథకాలు అర్హులందరికీ అందాలన్న ఉద్దేశ్యంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారన్నారు. గ్రామాల్లో రైతుల సమస్యలకై రైతు భరోసా, విద్య పరంగా నాడు నేడు పథకంలో భాగంగా పాఠశాలలు అభివృద్ధి, గ్రామాల్లో అందరికీ వైద్య అందాలన్న సంకల్పంతో పీహెచ్‌సీలు ఆధునికీకరణ, ప్రతి గ్రామంలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోని కూడా అమలు చేయని పథకాలు మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు గ్రామ ప్రజలకు, పలువురు లబ్ధిదారులకు వివరించి, పథకాల బ్రోచర్లను అందించారు. అనంతరం జల్‌జీవన మిషన్ ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఇంటింటికి తాగునీరు సరఫరాను పరిశీలించారు. గ్రామంలో నాడు – నేడు పథకం నిధులు రూ.20 లక్షలతో నిర్మించతలపెట్టిన ఎంపీపీ పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం చైర్మన్ దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఐనవల్లి పార్వతీ తాతారావు, మాసాహేబుపేట గ్రామ సర్పంచ్ గెద్దమూరి నీలవేణి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొంతం నరేష్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం



వాడ నర్సాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం నెలకొని వుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. వాడ నర్సాపురం గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇటువంటి సువరిపాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సొంత నిధులతో సమకూర్చిన వాటర్‌ప్రూఫ్ బ్యాగులను వలంటీర్లకు అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో వున్న కళింకోట కొండమ్మ, వట్నాల పావనికి రూ.10వేలు చొప్పున డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తన సొంత సొమ్మును సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డీఎస్ఎన్ రాజు, సర్పంచ్ రామారావు, ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ భాగ్యవతి పాల్గొన్నారు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్



దొంకాడలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : సుదీర్ఘ కాలంపాటు కేంద్రమంత్రిగా పనిచేసి దళిత, నిమ్న వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడిన బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని, దీనిపై తాను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలో దొంకాడలో నూతనంగా ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబూజీ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. మాదిగల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. మంత్రి పదవితో పాటు పలు పదవులు ఇచ్చి మాదిగలకు తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. దొంకాడలో దళితులకు పక్కా గృహాలు నిర్మించేందుకు పాటుపడతానన్నారు. రూ.10 లక్షలతో గ్రామంలో దళితులకు సామాజిక భవనం నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ చందిన కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపకులు ఆదుగుల మోసే, రెండు రాష్ట్రాల చర్మకారుల సంక్షేమ సమితి వ్యవస్థాపకులు వేలంగా శ్యామ్ మాదిగ పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు



ఒంపోలు చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : మండలంలోని ఒంపోలు చెరువు అభివృద్ధి పనులను సోమవారం ఎంపీడీవో పి.రవికుమార్ పరిశీలించారు. చెరువుల సుందరీకరణలో భాగంగా ఒంపోలు దేవతల చెరువు అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో రవికుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతమయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు, సర్పంచ్ సూరిబాబు పాల్గొన్నారు.

మన ప్రకృతిని మనమే కాపాడుకోవాలి



జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆచార్యులు

నక్కపల్లి : మన ప్రకృతిని మనమే కాపాడుకుని పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్ ఆచార్యులు, చిన దొడ్డిగల్లు గ్రంథాలయాధికారి కె.జనార్దన్ అన్నారు. సోమవారం చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో అంతర్జాతీయ జీవ వైవిధ్యం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీవ వైవిధ్యం, పరిరక్షణపై అనేక అంశాలను తెలియజేశారు. రసాయన కాలుష్యాన్ని అరికట్టి భూతాపాన్ని తగ్గించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. జంతువుల చర్మాలతో తయారు చేసే వస్తువులను ఉపయోగించరాదని, భూమిపై జీవరాశులను, వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉందని అన్నారు. విద్యార్థి దశ నుంచే జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంట్లో పిచ్చుకలు ఉండేవని, రాను రాను కనుమరుగై పోతున్నాయన్నారు. ప్రకృతిలో లభించే అపార సంపదను కాపాడుకోవడం ద్వారా జీవ వైవిధ్యాన్ని ప్రకృతిని కాపాడుకోవచ్చన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యాన కేంద్ర వార్షికోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న రత్నాకర్

మునగపాక : ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. నాగులాపల్లి చంద్రశేఖర్ పిరమిడ్ ధ్యాన కేంద్రం 5వ వార్షికోత్సవాలను ఆయన సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిల్లల నుంచి పెద్దల వరకు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. తద్వారా అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుందన్నారు.ఇటువంటి తరుణంలో ధ్యానం చేయడం మంచిదన్నారు. మనస్సు ప్రశాంతంగా ఉంటే ఉద్యోగ,వ్యాపారాల్లోనే కాకుండా నిజ జీవితంలో అభివృద్ధి సాధించవచ్చన్నారు. అలాగే విద్యార్థులు కూడా వేసవి కాలంలో ఇటువంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ త్రినాథ్, షిరిడీసాయి లా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరావు,భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

ఎస్.రాయవరం : గర్భిణులు విధిగా పోషకాహారం తీసుకునేలా అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించాలని వమ్మవరం గ్రామ సర్పంచ్ పాలవర్తి పాపారావు అన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం సమకూర్చే పోషకాహారాన్ని సోమవారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది నిత్యం కేంద్రానికి వచ్చే చిన్నారులతో పాటు, గర్భిణులకు, తల్లిదండ్రులకు కూడా పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు



పెదపాడు సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయరాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించి, అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ పథకాన్ని కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, మునలయ్య, శ్రీను, రమేష్, సముద్రాలు, రామునాయుడు, సన్యాసిరావు పాల్గొన్నారు.

రాజారామ్మోహన్‌రాయ్‌కు నివాళులు



గ్రంథాలయంలో రాజా రామ్మోహన్‌రాయ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): సామాజిక, న్యాయ, మత పరమైన సమానత్వంలో తాను చేపట్టిన ఉద్యమాల్లో మానవత్వానికి ప్రధానమైన చోటు కల్పించిన మహోన్నత వ్యక్తి రాజా రామ్మోహన్‌రాయ్ అని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షుడు మారిసెట్టి వెంకట అప్పారావు అన్నారు. అచ్యుతాపురం శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా రాజా రామ్మోహన్‌రాయ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న చిన్నారులకు రాజారామ్మోహన్‌రాయ్ వ్యక్తిత్వం, ఉద్యమ లక్ష్యాల గురించి వివరించారు. సతీ సహగమనం దురాచారాన్ని నిర్మూలించడంలో రామ్మోహన్‌రాయ్ పోరాట స్ఫూర్తి కనబరిచారని గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తెలిపారు. అచ్యుత స్కూల్ ఉపాధ్యాయురాలు లలితాంబిక మాట్లాడుతూ మహిళలకు విద్యావకాశాల గురించి అప్పట్లోనే పోరాడారని తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ దేవుడమ్మ, బుజ్జి దంపతులు

రాంబిల్లి: హరిపురంలో ఉపాధి కూలీలకు సోమవారం సర్పంచ్ ధూళి దేవుడమ్మ, సచివాలయం కన్వీనర్ ధూళి అప్పారావు(బుజ్జి) మజ్జిగ అందజేశారు. వేసవి కాలం పూర్తయ్యేవరకు మజ్జిగ పంపిణీ చేస్తామని బుజ్జి తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

జగనన్న కాలనీల్లో సమస్యలకు సత్వర పరిష్కారం



ఏఈ రాజు

నక్కపల్లి : జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించడం జరుగుతుందని గృహ నిర్మాణశాఖ ఏఈ రాజు తెలిపారు. సోమవారం ఆయన నక్కపల్లిలో తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. లబ్ధిదారులు బిల్లు చెల్లింపులు, మెటీరియల్ సరఫరాకు సంబంధించిన సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావచ్చన్నారు. వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు ఇసుక, ఇనుము, సిమెంట్ తదితర మెటీరియల్‌ను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చేపట్టిన నిర్మాణాలకు ఎప్పటికప్పుడు నిబంధనల మేరకు బిల్లు చెల్లింపులు కూడా జరుగుతున్నాయన్నారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి ఆసక్తి కలిగిన లబ్ధిదారులు గృహ నిర్మాణ శాఖ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలన్నారు. గ్రామాల్లో లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం మెటీరియల్ సరఫరా, బిల్లు చెల్లింపులకు సంబంధించి సమస్యలను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ద్వారా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. తమ పరిధిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా అధికారి దృష్టికి తీసుకువెళతామన్నారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో జరిగే స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు వేమాంబిక అమ్మవారి పండగ



పెదపల్లిలో జాతరకు ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్) వేమాంబిక అమ్మవారు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లి గ్రామ దేవత వేమాంబిక అమ్మవారి జాతర మహోత్సవానికి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పెదపల్లి గ్రామంలో వేమాంబిక అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో, పూలదండలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భారీ మందుగుండు సామాగ్రి సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. యలమంచిలి సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్ఐ పాపినాయుడు, రూరల్ ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో 20 మంది పోలీసు సిబ్బందితో భద్రత పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవ కమిటీ సభ్యుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

వేసవి శిక్షణతో విజ్ఞానం

రాంబిల్లి: వేసవి శిక్షణతో విద్యార్థులకు విజ్ఞానం దక్కుతుందని దిమిలి మహిళా పోలీస్ వెంకటలక్ష్మి అన్నారు. దిమిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన వేసవి శిక్షణలో రీసోర్స్ పర్సన్‌గా వెంకటలక్ష్మి, కె.వాసవి హాజరయ్యారు. చదవడం, రాయడంపై అవగాహన కల్పించారు. యోగా చేయించారు. నీతి కథలు చెప్పారు. సమాజంలో ఎలా మెలగాలో వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శకుంతల పాల్గొన్నారు.

పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి శక్తిప్రియ

ఎస్.రాయవరం : గర్భిణులు విధిగా పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో పైతారుపేట గ్రామంలో సోమవారం ఫ్యామిలీ కాన్సెప్ట్ వైద్య శిబిరానికి వచ్చి గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులుగా ఉన్నప్పుడు వత్తిడి తగ్గించుకుని సకాలంలో నిద్ర, ఇష్టమైన, బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

మునగపాక : మునగపాక బీసీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టడాన్ని కాలనీ వాసులు అడ్డుకున్నారు. కాలనీ సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం ఎలా నిర్మిస్తారంటూ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మునగపాకలో 35 సంవత్సరాల క్రితం సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రైతుల నుంచి భూమి సేకరించారు. 245 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. దీనిలో భాగంగా కాలనీ వాసుల సామాజిక అవసరాల కోసం 25 సెంట్లకు పైగా స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలం ప్రస్తుతం ఖాళీగా ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించేందుకు అధికారులు సమాయత్త మయ్యారు. సోమవారం ఆ స్థలంలో పనులు చేపట్టేందుకు అధికారులు ప్రయత్నించగా కాలనీ వాసులు అడ్డుతగిలారు. గతంలో తమకు కేటాయించిన స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం ఎలా కడతారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని తమకు కేటాయించిన స్థలంలో కట్టకుండా వేరే చోట నిర్మాణం జరిగేలా చూడాలని కాలనీ వాసులు అధికారులను కోరారు. ఏఎస్ఐ మన్మథరావు సంఘటన స్థలానికి చేరుకొని వివాదం లేకుండా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.